క్లుప్తంగా

ఆర్థికసాయం



ఎంజీఎం : ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ సురేష్‌కుమార్ కుటుంబానికి తన సహచర మిత్రులు పోగుచేసిన రూ.1 లక్షల నగదును డీఎంహెచ్ఓ డాక్టర్ కె.లలితాదేవి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. తమ తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా ఉంటూ సాయం అందించేందుకు ముందుకు వచ్చిన సహచర మిత్రులందరిని డీఎంహెచ్ఓ అభినందించారు.

ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలి

ఎంజీఎం : సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఈనెల 26న నగరంలోని హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పల్లె ఉదయ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఫెడరేషన్ ఎంజీఎం యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మహాసభను ప్రతీ ఒక్క మాదిగ ఉద్యోగులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు ఏకమై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నెల్సన్, సంపత్, సుమలత, ఆనందం, రాజు, ప్రభాకర్, శ్రీనివాస్, అశోక్, సుమన్, చంద్రకళ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖను కలిసిన లీగల్ సెల్ చైర్మన్

ఖిలా వరంగల్ : రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను మంగళవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి సురేఖను ఆయన కలిసి ఆయోధ్య రామమందిర ప్రతిమను అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

కేయూ వీసీని కలిసిన ఎమ్మెల్సీ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ నూతన వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డిని మంగళవారం వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి క్యాంపస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. ఈ సందర్భంగా కొంతసేపు వీసీతో ముచ్చటించారు. ఆయన వెంట కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్, కృష్ణ, బండి వేణు, టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, జిల్లా కార్యదర్శి సదానందం పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్‌ను కలిసిన విజయ్ భాస్కర్

హన్మకొండ: హైడ్రా కమిషనర్, ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ కలిశారు. రంగనాథ్ పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని నివాస గృహంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయండి

హసన్‌పర్తి: హసన్‌పర్తి రోడ్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు. మంగళవారం వరంగల్ ఎంపీ కడియం కావ్యను కలిసి వినతిపత్రం అందించారు. హసన్‌పర్తి రోడ్ (ఎల్లాపురం) రైల్వే స్టేషన్ చుట్టు పక్కల 25 గ్రామాలు ఉన్నాయి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్ ద్వారా రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఈ స్టేషన్‌లో ఇంటర్‌సిటీతో పాటు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌కు సహకరించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి, కుంబాకర్ సాయి తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన

నయీంనగర్ : మహిళలు, చిన్న పిల్లల రక్షణ కోసం ఉన్న చట్టాలపై మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ గీతాంజలి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల సఖీ సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, అందించే సేవలను వివరించారు. ప్రిన్సిపాల్ మంజుల, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



నిర్మాణాల వద్ద కొలతలు వేయిస్తున్న కమిషనర్

వరంగల్ : భవన నిర్మాణాల కోసం నిర్దేశిత నిబంధనలు, ప్రమాణాలు పాటిస్తేనే అనుమతులు మంజూరు చేస్తామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. ఆక్యుఫెన్సీ సర్టిఫికెట్లు, భవన నిర్మాణాల అనుమతుల కోసం పలువురు దరఖాస్తు చేసిన నేపథ్యంలో వాటికి అనుమతుల మంజూరు కోసం కమిషనర్ మంగళవారం నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా నగర పరిధిలోని ఎక్సైజ్ కాలనీ, వడ్డేపల్లి, మడికొండ, ఎల్బీనగర్, దేశాయిపేట ప్రాంతాల్లో నిర్మిత ప్రాంతాలను ఆమె పరిశీలించి నిర్మాణాల కోసం నమోదు చేసిన కొలతల వివరాలు క్షేత్ర స్థాయిలో కొలతలు వేసి నిర్ధారణ జరిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సరైన ధృవీకరణ పత్రాలు నమోదు చేసిన కొలతలు క్షేత్రస్థాయిలో కొలతలతో సరిపోతే అనుమతులు జారీ చేస్తామని అన్నారు. ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఎసీపీ ఎర్షాద్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ధరమ్‌సింగ్‌లు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఖిలా వరంగల్ : ఈనెల 24న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా పూర్వ విద్యార్థులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, బండి కోటేశ్వర్‌రావు, ఎస్.రవి, ఎనుకంటి రాజు, గుర్రం అజయ్ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ ఫోర్ట్ రోడ్డులో పీడీఎస్ నేత రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపైనే కార్మిక, కర్షక మహిళా పోరాటాలకు మద్దతుగా నిలిచిందన్నారు. నేడు విద్యారంగంలో జరుగుతున్న మోదీ ప్రభుత్వం తీసుకవచ్చిన నూతన జాతీయ విద్యా విధానం కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమంలో అగ్ర భాగన నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో మైదం సంజీవ, పాలకుర్తి సత్యం, నలిగంటి విజ య్‌పాల్, మైదం పాణి, గంగుల దయాకర్, ఇనుముల కృష్ణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రేరణ' నృత్యరూపకం ప్రదర్శన



ప్రేరణ నృత్యరూపకం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రంజిత్, నవ్యజలు

వరంగల్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వరంగల్ నాట్యకళాకారులు 'ప్రేరణ' నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్నారని, ఇది పేరిణి నాట్యంలో మొట్టమొదటి నృత్యరూపకం కావడం విశేషమని నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ నిర్వాహకులు గజ్జెల రంజిత్‌కుమార్, చాతరాజు నవ్యజలు తెలిపారు. మంగళవారం వరంగల్ ఎంపీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేరిణి తాండవాన్ని పద్మశ్రీ నటరాజు రామకృష్ణ సృష్టించారని, పేరిణి లాస్యాన్ని డాక్టర్ కళాకృష్ణ రూపకల్పన చేశారని తెలిపారు. విస్తృత నాట్యంగా రూపొందించి సంపూర్ణత్వాన్ని ఈ ప్రేరణ నృత్యరూపకంగా తాము మొట్టమొదటి సారిగా నృత్యరూపకంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ నృత్య రూపకంలో వరంగల్ కళాకారులు 70 మంది వరకు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈనాట్య ప్రదర్శనకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయ నృత్యశాఖ అధిపతి డా.వనజా ఉదయ్‌లు పాల్గొంటున్నారన్నారు. వరంగల్ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. అనంతరం ప్రేరణ నృత్యరూపకం కరపత్రాలను విడుదల చేశారు.

ఆధునిక జీవనానికి రామాయణం ఆదర్శం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

హన్మకొండ అర్బన్ : ఆధునిక జీవనానికి రామాయణం ఆదర్శమని పింగిళి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. వడ్డేపల్లిలోని పింగిళి కళాశాలలోని సంస్కృతం, హిందీ విభాగాల ఆధ్వర్యంలో 'ఎ స్టడీ ఆఫ్ ఉమెన్ క్యారెక్టర్స్ ఇన్ రామాయణ అండ్ ఇట్స్ రిలవెన్స్ ఇన్ మోడ్రన్ ఎరా' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. సమావేశానికి హాజరైన ప్రిన్సిపాల్ చంద్రమౌళి రామాయణంలోని స్త్రీ పాత్ర ఔన్నత్యానికి ఆదర్శవంతంగా నిలిచే సీత, కౌసల్య, ఊర్మిళలు ఉండగా, కైకేయి, మంధర, శూర్పణఖ లాంటి నెగెటివ్ పాత్రలు కూడా ఉన్నాయని, వీటిని గుర్తించి మన స్వభావంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. అనంతరం సదస్సుకు హాజరైన వివిధ కళాశాల ఉపన్యాసకులు, పరిశోధకులు, ఔత్సాహికులు టెక్నికల్ సెషన్‌లో తమ తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో పీఆర్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ హరిరాం ప్రసాద్, విశ్రాంత హిందీ ఉపన్యాసకులు శ్రవణ్‌కుమార్, సదస్సు కన్వీనర్ మమత, సంస్కృత విభాగాధిపతి రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎం.అరుణ, అధ్యాపకులు బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి

కాజీపేట: అకారణంగా ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఆటో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి హనుమకొండ డిపోకు చెందిన ఆర్టీసీ లోకల్ డిపో బస్సు డ్రైవర్ కాజీపేట చౌరస్తాలో రహదారికి ఓ ఆటో అడ్డంగా ఉండటంతో హారన్ కొట్టాడు. దీంతో ఆగ్రహం చెందిన ఆటోడ్రైవర్ బస్సు ఎక్కి డ్రైవర్ రబ్బానిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. కారణం లేకుండా డ్రైవర్‌పై దాడికి పాల్పడుతున్న ఆటోడ్రైవర్‌ను నిలువరించడానికి కండక్టర్ శోభారాణి ప్రయత్నించగా ఆటోడ్రైవర్ ఆమెపై కూడా దాడి చేయడంతో స్వల్పంగా గాయపడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఎస్సై నవీన్‌కుమార్ ఆటోడ్రైవర్‌కు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ నిర్వహించి కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్‌పై..

ఖిలా వరంగల్: గుర్తు తెలియని ఆకతాయిలు రాపిడో ఆటోడ్రైవర్‌పై దాడి చేసి సెల్‌ఫోన్, రూ.1500ల నగదు లాక్కెళ్లిన సంఘటన సోమవారం అర్ధరాత్రి వరంగల్ రంగశాయిపేట జంక్షన్ గవిచర్ల క్రాస్ రోడ్డుపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ సుందరయ్యనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మామిడి రమేష్‌కు సోమవారం అర్ధరాత్రి రాపిడో కాల్ వచ్చింది. ప్యాసింజర్ వద్దకు వెళ్తుండగా రంగశాయిపేట జంక్షన్ గవిచర్ల క్రాస్ రోడ్డు వద్ద ముగ్గురు వ్యక్తులు ఆటోను అడ్డుకుని డ్రైవర్ రమేశ్‌పై దాడి చేసి జేబులో ఉన్న రూ.1500ల నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. అతన్ని స్థానికులు ఎంజీఎంకు తరలించారు. మంగళవారం రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కాజీపేట రూరల్ : 47వ డివిజన్ బోడగుట్టలో షార్ట్ సర్క్యూట్‌తో స్లాబ్ ఇల్లు దగ్ధమైన ఘటనలో సుమారు రూ.50 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బోడగుట్టలో కొరివి దేవరాజ్ కుటుంబం అద్దెకు నివాసం ఉంటుంది. సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఉన్న గృహోపకరణాలు ఫర్నిచర్, బట్టలు, టీవీ, వంట సామగ్రి ఇతర సామాన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానిక కాంగ్రెస్ నాయకుడు దొంగల కుమార్‌యాదవ్ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దృష్టికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా బాధితులను ఫోన్‌లో ఎమ్మెల్యే పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కాజీపేట తహసీల్దార్ బావూసింగ్, ఆర్ఐ. శివకుమార్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తక్షణ సహాయంగా 75 కిలోల బియ్యం, రూ.5 వేల నగదు అందించారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు ఎమ్మెల్యే, అధికారులను వేడుకున్నారు.

ఆదివాసీ పోరుబిడ్డ కొమురం భీమ్



కొమురంభీమ్, నాయిని నర్సింహారెడ్డి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్, తదితరులు

హన్మకొండ : ఆదివాసీ పోరుబిడ్డ కొమురం భీమ్ అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళ వారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కొమురంభీమ్ జయంతి, మాజీ మంత్రి నాయిని నర్సింహా రెడ్డి వర్ధంతిని జరుపుకున్నారు. ముందుగా ఇరువురి చిత్రపటాలకు వినయ్‌భాస్కర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దాస్యం మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం, జరుగుతున్న అన్యాయంపై పోరాడిన యోధుడు కొమురం భీమ్ అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొమురం భీమ్‌కు సముచిత గౌరవం ఇచ్చామన్నారు.

కార్మిక పక్షపాతి నాయిని నర్సింహారెడ్డి..

మాజీ మంత్రి నాయిని నర్సింహా రెడ్డి కార్మిక పక్షపాతి అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్మిక శాఖ, హోం శాఖ మంత్రిగా రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్లు జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, నాయకులు నయీముద్దీన్, సుంచు కృష్ణ, జానకి రాములు, యాకుబ్, కోటేశ్వర్ రావు, విజయ్, రఘు, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్ఈపీ'తో ప్రభుత్వ విద్యావ్యవస్థ నిర్వీర్యం



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హన్మకొండ అర్బన్ : నూతన జాతీయ విద్యా విధానం-2020 ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర జరుగుతుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ అన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయవద్దని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ కోసమే బీజేపీ నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చిందని, ఇది రాజ్యాంగానికి, ఫెడరల్ సూత్రాలకు వ్యతిరేకమని ఆరోపించారు. రాష్ట్రంలో నూతన విద్యావిధానం అమలును అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, సభ్యులు సిపతి వినయ్, పాల్గొన్నారు.

నరకాసుర వధకు భద్రత ఏర్పాట్లు చేయాలి



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న మరుపల్లి రవి

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో ఈనెల 30న నిర్వహించే నరకాసుర వధకు భద్రత ఏర్పాట్లు చేయాలని నరకాసుర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి ఏసీపీ నందిరాం నాయక్‌ను కోరారు. మంగళవారం ఏసీపీని ఆయన కలిసి పూలమొక్కతో పాటు, వినతిపత్రం అందజేశారు. అనంతరం రవి మాట్లాడుతూ నరకాసుర వధకు సుమారు 50వేల పైగా ప్రజలు వస్తారని, ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఏర్పాట్లు చేయాలని ఏసీపీని కోరగా భారీభద్రత ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఆవునూరి రామ్మూర్తి, మరుపల్లి గౌతం, కొమురెల్లి అన్న, కుమారస్వామి, మరుపల్లి శివ, కొమ్ము శివ, రాజు, మంద పవన్ ఉన్నారు.

నగరంలో 'పొట్టేలు' సందడి



మాట్లాడుతున్న హీరో, హీరోయిన్ యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల

కాశిబుగ్గ : నగరంలో టాలీవుడ్ బ్యూటీ హీరోయిన్ అనన్య నాగళ్ల, హీరో యువచంద్రకృష్ణ సందడి చేశారు. వీరు నటిస్తున్న సినిమా 'పొట్టేలు' ఈనెల 25న విడుదల కానున్న సందర్భంగా వరంగల్ వెంకట్రామ థియేటర్‌లో సినిమా ప్రమోషన్‌ను మంగళవారం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో హీరోయిన్ అనన్య మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను దగ్గరగా చూపించే సినిమా పొట్టేలు సినిమా అని అన్నారు. మల్లేశం, బలగం సినిమాల మాదిరిగా మంచి కంటెంట్, ఎమోషనల్ డ్రామాతో, ఫుల్ కమర్షియల్‌గా ఉంటుందన్నారు. అక్టోబర్ 25న థియేటర్‌కు వచ్చి సినిమా చూసి ఆదరించాలని ఆమె కోరారు. హీరో మాట్లాడుతూ విలేజ్ నేపథ్యంలో ఒక చిన్న పాప చదువుకోసం మేము చేసే ప్రయత్నమే ఈ సినిమా అని అదే స్టోరీ లైన్ తీసుకుని డైరెక్టర్ సాహిత్ తీశారన్నారు. అజయ్, ప్రి యాంక శర్మ, తనస్వి చౌదరి, నీల్ సీన్, చత్రపతి శే ఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ కీలకపాత్ర పోషిస్తున్నారు.

స్వదేశీ మేళాను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్ : ఈనెల 23 నుంచి 27 వరకు హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరిగే స్వదేశీ మేళాను విజయవంతం చేయాలని జిల్లా చార్టెడ్ అకౌంటెంట్ డిస్ట్రిక్ బ్రాంచ్ చైర్మన్ ముందాడ భగవాన్‌దాస్ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. స్వదేశీ మేళాకు పారిశ్రామిక వేత్తలు పెద్ద హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉల్లి వెంకటేశ్వర్లు, బ్రదీనాథ్, శ్రీనివాస్, హరీష్, గిరిప్రసాద్, లలిత పాల్గొన్నారు.

బొడ్రాయికి పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ శాంతినగర్ సాకరా శికుంటలోని బొడ్రా యి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముస్కమల్ల సుధాకర్, కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ ఆధ్వర్యంలో వేద పండితులు భాస్కరాచార్యుల నేతృత్వంలో మంగళవారం గ్రామ దేవతకు పూజలు నిర్వహించారు.

ఏక్ పోలీస్ వ్యవస్థను అమలు చేయండి

ఖిలా వరంగల్: తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఉన్న ఏక్ పోలీస్ వ్యవస్థ విధానాన్ని అమలు చేయాలని మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ము ది రాజ్ మంగళవారం ఒక ప్రకటలో కోరారు.



సంక్షిప్త సమాచారం

అంధుల పాఠశాలలో అన్నదానం



రామన్నపేట : నగరంలోని కొత్తవాడలోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో ఇల్లంద గ్రామానికి చెందిన సట్ల అనిల్ కుమార్తె రిషిక జన్మదినం సందర్భంగా మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. అంధుల ఆశ్రమ నిర్వాహకులు మణిశంకర్ సేవలు చాలా గొప్పవని, నేటి యువతకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు. జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సూరజ్, బీజేపీ అధ్యక్షుడు కుమారస్వామి, పాల్గొన్నారు.

'మల్లికాంబ'లో...

హన్మకొండ అర్బన్ : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ జన్మదినం సందర్భంగా సయ్యద్ ఆసద్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

విజేతలకు బహుమతులు

కాజీపేట రూరల్ : డీజిల్‌కాలనీలోని హెచ్‌పీ ఆటో కేర్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ఫిల్‌స్పిన్ అండ్ విన్ కార్యక్రమం జరిగింది. హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సౌత్ సెంట్రల్ జోన్ బెన్ని సి.థామస్ మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిల్ స్పిన్ అండ్ విన్ క్యాంపెయిన్‌లో భాగంగా కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల రిఫైనర్ ఇక్కడ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి నా లుగు జిల్లాల వారికి మెగా ప్రైజ్‌ను బెన్ని సి.థామస్ చేతుల మీదుగా ఎంపిక చేసి బహుమతులను అందించారు. ప్రథమ బహుమతిగా స్మార్ట్ టీవీ, ద్వితీయ ల్యాప్‌టాప్, 36 స్మార్ట్ వాచ్‌లు, 146 డిన్నర్ సెట్లను కస్టమర్లు అయిన విజేతలకు అందించినట్లు తెలిపారు.

దొంగిలించిన మోటారు స్వాధీనం

వరంగల్: నగరంలోని డీసెంట్ ఫంక్షన్ హాల్ సమీపంలోని దళిత శ్మశాన వాటికలో ఉన్న బోర్ బావిలోని సబ్ మెర్సిబుల్ మోటార్‌ను ఈనెల 13న రాత్రి దొంగిలించుకుని పోతుండగా పోలీసులు గమనించి స్వాధీనం చేసుకున్నారు. తమ శ్మశాన వాటికలో ఉన్న బోర్‌బావిలో ఉన్న 5 హెచ్‌పీ మోటార్‌ను ఎవరో దొంగిలించుకుపోయారంటూ శ్మశానవాటికి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు స్కైలాబ్ పోలీస్ స్టేషన్‌లో ఈనెల16న ఫిర్యాదు చేశారు. పోలీసులు తాము స్వాధీనం చేసుకున్న సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను చూపించడంతో ఇదే అని స్కైలాబ్ గుర్తించడంతో ఆయనకు అప్పగించారు.

రూ.10 నాణేల చెల్లుబాటుపై అపోహలు వద్దు



హన్మకొండ: రూ. 10 నాణేల చెల్లుబాటుపై ఎలాంటి అపోహలకు తావు లేదని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ నారాయణ్ ప్రసాద్ నాయక్ అన్నారు. సోమ, మంగళ వారాల్లో బ్యాంక్ అధికారులు హనుమకొండ, వరంగల్ నగరంతో పాటు 46 బ్రాంచీ పరిధిలో పర్యటించి రూ.10 నాణేల చెల్లుబాటుపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. వ్యాపారస్తులకు రూ.10ల నాణేలు అందించారు. ఈ సందర్భంగా నారాయణ్ ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ రూ. 10 నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని ప్రజలు దుష్ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. వ్యాపారస్తులు కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజల వద్ద ఉన్న నాణాలను బ్యాంకులు తీసుకుంటాయన్నారు.

దర్గా రైల్వే బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి

కాజీపేట రూరల్ : నగరంలోని 47వ డివిజన్ పరిధిలో దర్గా సెంటర్‌లో మంగళవారం దర్గా రైల్వే బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో దర్గా ఏరియా కార్యదర్శి తొట్టె మల్లేశం అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి హాజరై మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతం గుండా భట్టుపల్లి, కడిపికొండ, అమ్మవారిపేట, మామునూరు, వరంగల్ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని దర్గా రైల్వే గేట్ పడటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

వేయిస్తంభాల దేవాలయంలో బహిరంగవేలం

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల ఆలయంలో మంగళవారం ఉదయం ఆలయ ఈఓ వెంకటయ్య ఆధ్వర్యంలో ఒక సంవత్సరం కాలపరిమితితో (2024-25) భక్తులచే సమర్పించబడిన కొబ్బరిముక్కలను సేకరించుకునే హక్కు సీల్ టెండర్ కం బహిరంగవేలం నిర్వహించారు. వరంగల్ దుర్గేశ్వరస్వామి దేవాలయం ఈఓ ప్రసాద్ సమక్షంలో నిర్వహించిన వేలంలో రూ.4,01,000 పాట రావడం జరిగిందని ఈఓ వెంకటయ్య తెలిపారు. గత సంవత్సరం రూ.2,92,000 పాట ఉందని తెలిపారు.

టీచర్లకు శిక్షణ ప్రారంభం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని నూతనంగా ఇటీవలే నియమితులైన ఉపాధ్యాయులకు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ ప్రారంభమైంది. హనుమకొండలోని తేజస్వి, గ్రీన్‌వుడ్ పాఠశాలలో ఈ శిక్షణ నిర్వహించారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ విద్యాశాఖలో అమలు చేస్తున్న అభ్యసనాభివృద్ధిని నూతన ఉపాధ్యాయులు అవగాహన పర్చుకొని విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. హసన్‌పర్తి ఎంఈఓ రవీందర్ మాట్లాడారు. నరేందర్‌రెడ్డి, భద్రయ్య, ప్రసాద్, సంపత్‌కుమార్, రాణి, పద్మావతి, వాసం రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు.



తల్వార్‌తో హోంగార్డు హల్‌చల్

కాశిబుగ్గ : మద్యం మత్తులో ఓ హోంగార్డు తల్వార్ పట్టుకుని కాశిబుగ్గ ఓ సిటీ జంక్షన్‌లో మంగళవారం రాత్రి హల్‌చల్ చేసిన వీడియోలు వాట్సాప్‌లలో వైరలయ్యాయి. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ఆయన కాశిబుగ్గ సొసైటీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో తల్వార్ పట్టుకుని ఓ సిటీ జంక్షన్‌లో హల్‌చల్ చేశాడు. దీంతో కొంత మంది స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఇది చూసిన పోలీసులు ఆ ఓంగార్డును స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. దీనిపై ఇంతెజార్‌గంజ్ పోలీసులను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా వారు ఫోన్ లిఫ్ట్ చేయలేదు